## ద్విచక్ర వాహనదారులకు
# ఉచితంగా హెల్మెట్ల పంపిణీ




**నాగిరెడ్డిపేట,వుదయం**

రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం పోలీసులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాస్, సీఐ రాజిరెడ్డి, ఎస్సై భార్గవ్ గౌడ్ ఆధ్వర్యంలో 50 మంది ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ, ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ప్రాణ రక్షక సాధనమని, ప్రమాదాల సమయంలో అది సంజీవినిలా పనిచేస్తుందని తెలిపారు. మన శరీరంలో తల భాగం అత్యంత ముఖ్యమైందని, తలకు గాయం అయితే ప్రాణాపాయం కలగొచ్చని హెచ్చరించారు.అలాగే, శరీరంలోని ఇతర గాయాలు చికిత్సతో నయం కావచ్చని, కానీ తల రక్షణ అత్యంత అవసరమని వివరించారు. కాబట్టి ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.

## శక్తి భవన్ పూజా నిర్వహణ



**నాగిరెడ్డిపేట, వుదయం**

గోపాల్పేట గ్రామపంచాయతీకి నూతనంగా మంజూరైన శ్రీ శక్తి భవన్ పూజా కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్పేట గ్రామానికి శ్రీ శక్తి భవన్ మంజూరు చేసినందుకు స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ కు గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గోపాల్పేట సర్పంచ్ వంశీకృష్ణ గౌడ్, ఉప సర్పంచ్ గులామ్ హుస్సేన్, మహిళా సమాఖ్య సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్, గోపాల్పేట గ్రామ అధ్యక్షుడు సూరేపల్లి రాజు, ఫారుక్ సాబ్, అంతిబాబు, పంచాయతీ కార్యదర్శి అలాగే ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యకు చెక్

**గద్వాల (వుదయం ప్రతినిధి)**



గట్టు తుమ్మలపల్లి గ్రామంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు గ్రామ సర్పంచ్ బి.గోవిందమ్మ ముందడుగు వేశారు. గ్రామ ప్రజలకు ఇకపై నీటి కొరత లేకుండా ఉండేలా కొత్త బోర్వెల్ నిర్మాణాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఆమె తనయుడు బి. రవి నాయుడు కూడా చురుకుగా పాల్గొన్నారు గ్రామంలో గత కొంతకాలంగా తాగునీటి సమస్య తలెత్తుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు కొత్త బోర్ ద్వారా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రానుంది ఈ సందర్భంగా గ్రామస్థులు సర్పంచ్ గోవిందమ్మ రవి నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే చర్య లు తీసుకోవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈరన్న గౌడ్ వార్డు సభ్యులు ఆంజనేయులు గౌడ్ భీమేష్ ప్రజలు పాల్గొన్నారు.

## బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ


**నారాయణపేట (వుదయం ప్రతినిధి)**



నారాయణపేట జిల్లా, మక్తల్ మున్సిపాలిటీలో ఆరో వార్డు మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ తెలిపారు. శనివారం మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని చందాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎస్పీ స్వయంగా సందర్శించి, ఎన్నికల సరళి, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్నికల అధికారులతో మాట్లాడిన ఎస్పీ, పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా సాగాలని సూచించారు. గతంలో ఆరో వార్డు ఎన్నికల అభ్యర్థి మరణం కారణంగా ఈ వార్డుకు తిరిగి ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.ఓటు వేయడానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్లు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వృద్ధులు, మహిళలు మరియు దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించాలని తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు జిల్లా పోలీసు శాఖ హై అలర్ట్లో కొనసాగాలని, శాంతి-భద్రతలను కాపాడడంలో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు కూడా సహకరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి తోడ్పడాలని కోరారు. మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి తదితరులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నెరవేరిన విఠలాపూర్ రైతుల కల

**దామరగిద్ద (వుదయం ప్రతినిధి)**



దామరగిద్ద మండలం విఠలాపూర్ రైతుల లో ఓల్టేజీ సమస్యతో ఎంతో కాలంగా బాధలు పడుతూ వచ్చారు.నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి చొరవతో విఠలాపూర్ లో 33/11 కే.వి సబ్ స్టేషన్ ను ప్రారంభించ దంతో రైతుల కల నెరవేరిం ది.దామరగిద్ద మండలంలోని విఠలాపూర్ గ్రామంలో శనివా రం నారాయణ పేట్ ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి ఆదేశాలతో 33/11 కే.వి సబ్ స్టేషన్ ను గ్రామ సర్పంచ్ హనుమంతు, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి లు ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షులు బాల్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఈదప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శరణప్ప, దామరగిద్ద సర్పంచ్ కనికి రెడ్డి, శరన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను నిషేధించాలి




**నారాయణపేట (వుదయం ప్రతినిధి)**

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాలకు అనుగుణంగా శనివారం నాడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నారాయణపేట వారి ఆధ్వర్యంలో నారాయణపేట టౌన్ ఎయిడెడ్ వైదిక హై స్కూల్ లో బాల బాలికలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డిఫెన్స్ కౌన్సిల్ కే. లక్ష్మిపతి గౌడ్ హాజరైయ్యారు. ఈ సదస్సులో వారు పోక్సో చట్టం గురించి మాట్లాడుతూ పోక్సో చట్టం (పోక్సో అంటే లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం 2012) నవంబరు 14, 2012 నుండి అమలులోకి వచ్చినదని, ఈ చట్టమును అతిక్రమిస్తే కఠిన శిక్షలు వుంటాయని, పిల్లలు మన భవిష్యత్తు మనకు రక్షణ కల్పించే ఈ చట్టం గురించి అందరికీ, ముఖ్యంగా పిల్లలకు తెలియజేయడం మనందరి బాధ్యత అన్నారు.18 ఏళ్ల లోపు వయస్సు ఉన్న బాలబాలికలందరికీ ఈ చట్టం వర్తిస్తుంది అని ఇది లింగ భేదం లేని చట్టమన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరిస్తూ బాలికలను అనవసరంగా తాకడం, లైంగిక వేధింపులకు గురి చేయడం, అశ్లీల చిత్రాలు వంటి వివిధ రకాల నేరాలకు పాల్పడితే ఇందులో కఠిన శిక్షలు ఉన్నాయని, లైంగిక నేరం జరిగినట్లు తెలిస్తే, వెంటనే పోలీసులకు లేదా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి సమాచారం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సమాచారం దాచడం కూడా నేరమేనని, నేరం గురించి తెలిసినా, అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు లేదా స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్కు తెలపడం చట్టరీత్యా తప్పనిసరి అని తెలిపారు. పిల్లలో పనిలో కాదు బడి లో ఉండాలన్నారు. ఈ చట్టం ద్వారా రక్షణ పొందే విధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమములో ఎయిడెడ్ వైదిక హై స్కూల్ హెడ్ మాస్టర్ కే.గంగాధర్ , స్కూల్ బోధన, బోధనేతర సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన
# మాజీ ఎమ్మెల్యే మోహన్

**శంకరపట్నం, వుదయం ప్రతినిధి:**




రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన మీస రవీందర్ కుటుంబాన్ని పరామర్శించిన మానకొండూరు మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ విప్ ఆరెపల్లి మోహన్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మోహన్ మాట్లాడారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన, శ్రీ మత్స్య గిరింద స్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మీస రవీందర్ ఏప్రిల్ 9న రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా రవీందర్ కుటుంబాన్ని పరామర్శించి మృతి కి గల కారణాలు అడిగి తెలుసుకుని, ప్రగాడ సానుభూతి వ్యక్తం చేసి, ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించినట్లు మాజీ ఎమ్మెల్యే మోహన్ తెలిపారు. మాజీ ఎంపీటీసీ, మాజీ మత్స్య గిరింద్ర స్వామి దేవస్థానం చైర్మన్ ఉప్పుగల్లు మల్లారెడ్డి రవీందర్ కుటుంబ సభ్యులు ఉన్నారు.

## విద్యతోనే సమాజ మార్పు..
# ఎడ్యుకేషన్ హబ్‌గా అందోల్ అభివృద్ధి

**మంత్రి దామోదర్ రాజనర్సింహ**
**మంత్రి సుడిగాలి పర్యటనలో రూ. 27.76 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం**
**పాలిటెక్నిక్‌లో రూ. 43 లక్షలతో మెకానికల్ వర్క్‌షాప్ ప్రారంభం**
**నియోజకవర్గంలో విద్యాసంస్థల విస్తరణకు ప్రాధాన్యం**

**సంగారెడ్డి వుదయం జిల్లా ప్రతి నిధి.**




విద్యే సమాజాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శనివారం అందోల్ నియోజకవర్గంలో నిర్వహించిన సుడిగాలి పర్యటనలో భాగంగా విద్యా అభివృద్ధి, మౌలిక వసతుల పెంపుపై ఆయన దృష్టి సారించారు. శివంపేట పాలిటెక్నిక్ కళాశాలలో న్యూ హాలాండ్ పరిశ్రమ సిఎస్ఆర్ నిధులు రూ. 43 లక్షలతో నిర్మించిన మెకానికల్ వర్క్‌షాప్ షెడ్‌ను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... విద్యతోనే జీవితాల్లో వెలుగులు నిండుతాయని, అందోల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే పాలిటెక్నిక్, జేఎన్టీయూ ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, వ్యవసాయ, మహిళా కళాశాలలతో పాటు మోడల్, రెసిడెన్షియల్, కస్తూర్బా పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బాలికల భద్రత, వసతుల విషయంలో రాజీ లేదని స్పష్టం చేశారు. సిఎస్ఆర్ నిధులు రూ. 10 కోట్ల తో నియోజకవర్గంలోని విద్యాసంస్థలలో మౌలిక వసతుల మెరుగుదల పనులు చేపడుతున్నట్లు వివరించారు.ఇదిలా ఉండగా, మంత్రి తన పర్యటనలో భాగంగా రూ. 27.76 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అందోల్‌లో రూ. 1.80 కోట్లతో నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించగా, చెరువు కట్ట వద్ద రూ. 5 కోట్లతో నిర్మించనున్న పర్యాటక రెస్టారెంట్‌కు శంకుస్థాపన చేశారు. అలాగే రూ. 20 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ కార్యాలయాల సముదాయం పనులను ప్రారంభించారు. రూ. 53 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనం మొదటి అంతస్తును ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయని సూచించారు. పాలిటెక్నిక్ విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ పాండు, ప్రిన్సిపాల్ నారాయణ గౌడ్,న్యూ లాండ్ ఫౌండేషన్ ప్రతినిధి డి వి రెడ్డి,సర్పంచ్ సంధ్యా రాణి, సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి
**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల (వుదయం ప్రతినిధి)**

అంగన్వాడి కేంద్రాల ద్వారా సరఫరా చేసే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సక్రమంగా అందజేస్తూ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం గట్టు మండలం చమన్ ఖాన్ దొడ్డి గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థులతో వారు నేర్చుకున్న అంశాలను చదివించి ఆప్యాయంగా పలకరించారు. మాట్లాడుతూ గట్టు మండలం ఆస్పిరేషనల్ బ్లాక్ గా ఉందని, సంపూర్ణత అభియాన్ కార్యక్రమం లో ఉన్న 7 అంశాలను 100% జరిగేలా చూడాలని, అంగన్వాడి కేంద్రాలకు వచ్చే గుడ్ల పరిమాణం తక్కువగా ఉంటే వాపస్ పంపించాలని అక్కడి అధికారులను ఆదేశించారు. పలువురు చిన్నారుల ఎత్తు, బరువు కొలతలను పరిశీలించి తగు సూచనలు చేశారు. వండిన ఆహారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో వివిధ పాఠ్యాంశాలను చదివించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు గురించి మాట్లాడారు. అంతకుముందు గ్రామంలో నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మరుగుదొడ్లను నాణ్యతతో నిర్మించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత అధికారులను హెచ్చరించారు. ఈ పర్యటనలో ఐసిడిఎస్ సిడిపిఓ హేమలత, సూపర్వైజర్ కృష్ణవేణి, పంచాయతీరాజ్ ఏఈ రాజ్ కుమార్, తదితరులున్నారు.

# సిద్దిపేటలో వినూత్నంగా 'జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ డే'

**సిద్దిపేట, (వుదయం ప్రతినిధి)**




రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా సిద్దిపేట ట్రాఫిక్ పోలీసులు 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా శనివారం ఒక వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. సాధారణంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించే పోలీసులు, నేడు 'జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ డే' నిర్వహించి అందరినీ ఆశ్చర్యపరిచారు. రాజీవ్ రహదారి మరియు సిద్దిపేట పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులను పోలీసులు అడ్డుకున్నారు. అయితే, వారికి ఫైన్ వేయకుండా, వారు చేసిన తప్పు ఏమిటో వివరించారు.ఆ ఉల్లంఘనకు సాధారణంగా పడే జరిమానా ఎంతో తెలియజేశారు. నిబంధనలు పాటించకపోవడం వల్ల కలిగే ప్రాణాపాయాన్ని వివరించి, వారికి ఒక గులాబీ పువ్వును అందజేసి కౌన్సిలింగ్ ఇచ్చారు. మరోసారి తప్పు చేయబోమని వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు.స్కూల్ బస్సుల తనిఖీ విద్యార్థులకు అవగాహన: కేవలం వాహనదారులకే కాకుండా, పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల బస్సులను కూడా పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బస్సుల ధ్రువపత్రాలను (Fitness, Insurance etc.) పరిశీలించారు. డ్రైవర్లకు పలు సూచనలు చేయడంతో పాటు, విద్యార్థులకు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శిక్షించడం కంటే అవగాహన కల్పించడం ద్వారానే వాహనదారుల్లో శాశ్వత మార్పు వస్తుందని నమ్మి ఈ కార్యక్రమం చేపట్టాం అన్నారు. ట్రాఫిక్ ఎస్ఐలు గోపాల్ రెడ్డి, ఉమేష్, ఏఎస్ఐమల్లేశం, మరియు ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. పోలీసుల ఈ వినూత్న ప్రయత్నాన్ని స్థానిక ప్రజలు వాహనదారులు అభినందిస్తున్నారు.

# పరీక్షా కేంద్రాల వద్ద గుమిగూడటం నిషేధం

**సిద్దిపేట, (వుదయం ప్రతినిధి)**

సిద్దిపేట జిల్లాలో ఈ నెల 20వ తేదీ నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) పరీక్షల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. పరీక్షలు నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా జరిగేందుకు జిల్లాలోని 9 పరీక్షా కేంద్రాల వద్ద భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (BNSS) సెక్షన్ 163 ప్రకారం నిషేధాజ్ఞలు విధిస్తూ జిల్లా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఉత్తర్వులు జారీ చేశారు.

పరీక్షా కేంద్రాల వివరాలు:
1. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇందిరానగర్ (ఏ), సిద్దిపేట. 2. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు), గజ్వేల్, 3. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు), పెద్దమ్మగడ్డ, చేర్యాల, 4. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు), హుస్నాబాద్
5. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సిద్దిపేట,
6. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇందిరానగర్ (బి), సిద్దిపేట
7. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, గజ్వేల్
8. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు బి), పెద్దమ్మగడ్డ, చేర్యాల,
9. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు), హుస్నాబాద్.

నిబంధనలు మరియు కాలపరిమితి:
ఈ నెల 20.04.2026 నుండి 27.04.2026 వరకు, పరీక్షలు జరిగే ప్రతిరోజూ ఉదయం 07:00 నుండి సాయంత్రం 07:00 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయి. పరీక్షా కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటాన్ని నిషేధించారు. కేంద్రాల సమీపంలోని అన్ని ఛాయాచిత్ర నకలు (జిరాక్స్) కేంద్రాలను తప్పనిసరిగా మూసి ఉంచాలి. కర్రలు, రాళ్లు, ఆయుధాలు లేదా ఇతర ప్రమాదకర వస్తువులు మరియు పరీక్షకు సంబంధించిన నిషేధిత పత్రాలను తీసుకురావడం శిక్షార్హమైన నేరం.విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసేలా అన్ని రక్షక భట నిలయాల అధికారులు తగిన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. రక్షక భట నిబద్ధులు, సైనిక సిబ్బంది, విద్యాశాఖ తనిఖీ అధికారులు మరియు అంత్యక్రియల ఊరేగింపులకు మాత్రమే ఈ ఉత్తర్వుల నుండి మినహాయింపు ఉంటుంది.

# కవిత్వమే మనుషులను కలిపి ఉంచుతుంది

**సిద్దిపేట, (వుదయం ప్రతినిధి)**



మనుసులను శుభ్రం చేసి, సమాజంలో విడిపోతున్న మనుషులను తిరిగి కలిపి ఉంచే శక్తి ఒక్క కవిత్వానికే ఉందని ప్రముఖ కవి, హైదరాబాద్ పుస్తక ప్రదర్శన (బుక్ ఫెయిర్) అధ్యక్షులు మరియు 'కవిసంగమం' వ్యవస్థాపకులు యాకూబ్ అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో శనివారం జరిగిన కొండి మల్లారెడ్డి కవితా సంపుటి 'చెట్టు కూలుతున్న చప్పుడు' ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.సామాజిక మార్పుకు కవిత్వమే బాట:ఈ సందర్భంగా కవి యాకూబ్ మాట్లాడుతూ కవి రాసిన నాలుగు వాక్యాలు కనీసం ఒక్క వ్యక్తిని కదిలించగలిగినా, కవిత్వ ప్రయోజనం నెరవేరినట్లేనని, అది సామాజిక మార్పుకు దారి తీస్తుందని పేర్కొన్నారు. నేటి సమాజంలో సంబంధాలు క ను మ రు గ వు తు న్నా య ని , కన్నవారిని వృద్ధాశ్రమాలకు పంపే అమానవీయ పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో పెను సంక్షోభం తలెత్తకముందే కవులు, రచయితలు నిక్కచ్చిగా స్పందించాలని, కవి మౌనం సమాజానికి ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రముఖ జర్నలిస్టులు కొమురవెల్లి అంజయ్య, ముత్యాల దినకర్ పాల్గొన్నారు. కవి యాకూబ్. కవులు, రచయితలు యాదగిరి, అశోకరాజు, బచ్చలి సత్తయ్య, సాహితీప్రియులు పాల్గొన్నారు.


## ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలి
**-మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య**

**జిన్నారం ఏప్రిల్ 18(వుదయం ప్రతినిధి)**



గడ్డపోతారం మున్సిపల్ పరిధిలో వృత్తి వ్యాపార లైసెన్సుల అనుమతులను తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ట్రేడ్ లైసెన్సులకు సంబంధించి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దుకాణాలు హోటల్లు మెడికల్ షాపులు పరిశ్రమలు వాణిజ్య వ్యాపార సంస్థలు పరిశ్రమలకు ట్రేడ్ లైసెన్సులు అందిస్తామన్నారు. అనుమతులకు విరుద్ధంగా షాపుల నిర్వహణ కార్యకలాపాలు జరిపితే మున్సిపల్ ఆక్ట్ 2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్సులు తీసుకొని పట్టణాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి శానిటరీ ఇన్స్పెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయాలకు వేతనాలను అందించిన కౌన్సిలర్




**జిన్నారం ఏప్రిల్ 18(వుదయం ప్రతినిధి)**

గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని చెట్ల పోతారం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు లీ ఫార్మా పరిశ్రమ సహకారంతో వేతనాలను శనివారం ఇద్దరూ వాయాలకు ఒకటో వార్డు కౌన్సిలర్ బాలు గారి మాధవి శ్రీనివాస్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... లీ ఫార్మా పరిశ్రమ సహకారంతో సిఎస్ఆర్ నిధుల ద్వారా ఇద్దరు ఆయాలకు ప్రతినెల వేతనాలను అందించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు వెంకట్ రెడ్డి, స్థానిక నాయకులు బాలకృష్ణ మధు లక్ష్మణ్ ఉపాధ్యాయులు ఆయాలు పాల్గొన్నారు